క్లుప్తంగా

గర్నిమిట్ట యల్లమ్మకు బోనాలు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మతల్లికి భక్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, ప్రత్యేకపూజలు, మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు బోనాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం గ్రామంలో ఊరేగింపు చేపట్టారు.

శ్మశానాల అభివృద్ధికి నిధులు

కురబలకోట: శ్మశానాలకు అభివృద్ధికి ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి నిధులు మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ బైసాని జ్యోతి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు కురబలకోటకు రూ.5 లక్షలు, ముదివేడుకు రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

రెడ్డి సంక్షేమసంఘ ప్రధాన కార్యదర్శి రాజీనామా

మదనపల్లె : మదనపల్లె రెడ్డి సంక్షేమసంఘం ప్రధాన కార్యదర్శి కంభం నాగభూషణరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తూ లేఖను సంఘం అధ్యక్షుడు డాక్టర్.ద్వారకనాథ రెడ్డికి అందజేసినట్లు చెప్పారు.కమిటీ సభ్యులందరూ తన రాజీనామాను ఆమోదించవలసిందిగా కోరారు. ఐక్యతకు, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన రెడ్డిసంక్షేమసంఘంలో వివాదాల కారణంగా కీలకవ్యక్తులు బాధ్యతల నుంచి తప్పుకోవడంపై పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె,సారెలతో మొక్కులు చెల్లించారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. హిందువులతో పాటు ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.

పొట్టేళ్లు, మేకపోతులకు భలే గిరాకీ



సంతలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పొట్టేళ్లు

పీలేరు రూరల్ : బక్రీద్ పండుగ నేపథ్యంలో పొట్టేళ్లు, మేకపోతులకు భలే గిరాకీ ఏర్పడింది. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన గొర్రెల సంతలో ధరలు ఆకాశాన్నంటాయి. మంచి రకం పొట్టేళ్లు, మేకపోతులకు డిమాండ్ ఏర్పడింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర నుంచి వ్యాపారులు అధిక సంఖ్యలో తరలివచ్చి కొనుగోలు చేశారు. పొట్టేళ్లు రూ. 20 వేల నుంచి రూ. 90 వేలు ధర పలికాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, వ్యాపారులతో వారపు సంత కిటకిటలాడింది.

నెరవేరిన గడప గడపకు మన ప్రభుత్వ లక్ష్యం

- గ్రామాల్లో వేగంగా అభివృద్ధి పనులు
- ఎంపీ, ఎమ్మెల్యే చొరవతో సమస్యలకు పరిష్కారం





ఎల్లుట్లలో ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి (ఫైల్), కామన్నగారిపల్లెలో తాగునీటి బోరు డ్రిల్ చేయిస్తున్న దృశ్యం

గుర్రంకొండ: రాష్ట్రప్రభుత్వం ఏ ఉద్దేశంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించిందో ఆ లక్ష్యం నెరవేరింది. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చొరవతో సంగసముద్రం, ఎల్లుట్ల, టి.పసలవాండ్లపల్లె గ్రామాల్లో ఏన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు అధికారులు, ప్రజల సమక్షంలోనే పరిష్కారమయ్యాయి. ఆయా గ్రామాల్లో అభివృద్ధిపనులు శరవేగంగా దూసుకుపోతున్నాయి. సమస్యలను ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. దీంతో ప్రజల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై నమ్మకం, విశ్వాసం గణనీయంగా పెరుగుతోంది.

నెరవేర్చిన హామీలు

సంగసముద్రంలో..

- యల్లంపల్లె మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు రూ.5 లక్షలు మంజూరు, పనులు జరుగుతున్నాయి. అలాగే మామిళ్లవారిపల్లెలో శ్రీ సత్తెమ్మతల్లి ఆలయానికి ప్రహరీగోడ నిర్మాణం కోసం రూ. 1.50 లక్షలు మంజూరు అయ్యాయి.
- మామిళ్ల వారిపల్లెలో మసీదు ప్రహరీగోడ నిర్మాణానికి రూ.2.50లక్షలు మంజూరు చేశారు. అభయాంజనేయస్వామి ఆలయానికి దారి ఏర్పాటు కోసం రూ. 1.50 లక్షలు మంజూరైంది. అలాగే మామిళ్లవారిపల్లెలో తాగునీటిబోరు, మోటారుకు రూ. 6 లక్షలతో మరమ్మతులు చేశారు.
- కుమ్మరపల్లె దర్గా రోడ్డు నిర్మాణానికి రూ.1లక్ష మంజూరు, రామాలయం అభివృద్ధికి రూ.50 వేలు పంపిణీ చేశారు.
- సంగసముద్రంలో ఆటోకొనుగోలుకు చోటు అనే వ్యక్తికి రూ.25వేలు పంపిణీ చేశారు. అలాగే దళితవాడకు చెందిన గూటం రమణకు రూ. 25వేలు అందజేశారు.
- కుమ్మరపల్లెలో బి. సీతమ్మ అనే మహిళకు ఇంటి నిర్మాణం కోసం రూ. 15 వేలు పంపిణీ చేశారు.
- గపడ గపడకు మన ప్రభుత్వం క్రింద ప్రస్తుతం రూ.20 లక్షల అభివృద్ధి నిదులు మంజూరయ్యాయి.

టి.పసలవాండ్లపల్లెలో...

- కామన్నగారిపల్లె, పాతవెంగంవారిపల్లెకు తాగునీటి సౌకర్యార్థం బోరు, బోరుమోటారు రూ. 6 లక్షలు మంజూరు చేశారు.
- పసలవాండ్లపల్లె ఎగువ హరిజనవడాలో నలగురికి వ్యక్తిగత సాయం రూ.45 వేలు పంపిణీ చేశారు.
- గుట్టకింద పల్లెలో మట్టి రోడ్డు నిర్మాణం కోసం రూ.లక్ష మంజూరు అయింది.
- దిగువ హరిజనవాడలో తాగునీటిబొరుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు
- సచివాయలం వద్ద బోరుడ్రిల్లింగ్, మసీదు పీర్ల చావిడికి రూ. 25 వేలు సాయం పంపిణీ చేశారు.
- బత్తినగారిపల్లె, టి.పసలవాండ్లపల్లె, చాకలపల్లె, దిగువ హరిజనవాడ, కామన్నగారిల్లె, పాతవెంగంవారిపల్లెకు , గుట్టకిందపల్లెలో, పూజారివాండ్లపల్లె, కుమ్మరపల్లె, మొరంకింద పల్లెలకు తాగునీటి సౌకర్యార్థం కోసం రూ. 8లక్షలతో పైపులైన్లు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేశారు.
- పిల్లావాండ్లపల్లెలో శ్రీ రామాలయం అభివృద్ధికి రూ.50 వేలు అందజేశారు.

ఎల్లుట్లలో...

- ఎల్లుట్ల దళితవాడ తాగునీటిబోరు, పైపులైన్లు, ఎల్లుట్ల కస్పాలో సింగిల్‌ఫేజ్ మోటారు మంజూరు చేశారు.
- రాజువారిపల్లెలో శ్రీరామస్వామి ఆలయఅభివృద్ధి కోసం రూ.లక్ష, నల్లగుట్టపల్లెలో అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ. లక్ష పంపిణీ చేశారు.
- నల్లగుట్టపల్లె దళితవాడలొ శ్రీ రామాలయ అభివృద్ధికి రూ. 70 వేలు, దళితవాడలో ఇంటి నిర్మాణల కోసం రూ. 75 వేలు అందజేశారు.
- కల్లూరువారిపల్లెలో దారి సమస్య పరిష్కారం కోసం రూ. 60 వేలు అందించారు
- ఎన్నో సంవత్సరాలుగా బస్సు సర్వీసు నడవని మదనపల్లె- ఎల్లుట్ల-చెర్లోపల్లె మార్గంలో మళ్లీ ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించారు.

హామీలన్ని నెరవేర్చారు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంపీ, ఎమ్మెల్యే లు ప్రజల కిచ్చిన హామీలన్ని నెరవేర్చారు. తాగునీటి, మురుగునీటి కాలువల సమస్యల పరిష్కరించారు. ఆలయాలకు, మసీదుల అభివృద్ధికి ఆర్థిక సాయం అందించారు. ప్రజలకు అవసరమైన అన్ని పనులు, సౌకర్యాలను కల్పించేందకు సహకరించారు.**-చింతిర్ల నాగేంద్ర,సంగసముద్రం**

ఏళ్ల నాటి సమస్యలు పరిష్కారం



మా పంచాయతీలో ఇటివల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుతం కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పర్యటించారు. సుమారు 15 సంవత్సరాలు పరిష్కారానికి నోచుకోని సమస్యలకు పరిష్కారం చూపించారు. ఎనిమిది గ్రామాలకు పైపులైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేశారు.

- కరుణాకర్, టి.గొల్లపల్లె, టి.పసలవాండ్లపల్లె

విస్తృతంగా అభివృద్ధి పనులు



గడప గడపకు మన ప్రభత్వం కార్యక్రమాలతో గ్రామాల్లో ఆభివృద్ధి పనులు విస్తృతంగా జరుగుతున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యేలు పర్యటించిన అనంతరం గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి నిధులు వెంటనే మంజూరు అవుతున్నాయి. అలాగే ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నాయి.

- సబ్రీన్ ముక్తియార్, జెడ్పీటీసీ, గుర్రంకొండ

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

పీలేరు రూరల్ : ఈ నెల 29న నిర్వహించనున్న బక్రీద్‌ను ముస్లిం సోదరులు ప్రశాంతంగా జరుపుకోవాలని రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ముస్లిం, హిందూ, క్రైస్తవ మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాలు వారు కలసి మెలసి ఉండి పండుగ ప్రశాంతంగా జరగడానికి సహకరించాలన్నారు. సోషల్ మీడియాలో మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. బక్రీద్ రోజున తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషాకు సూచించారు. స్థానిక ఈద్గా వద్ద, మసీదుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐలు నరసింహులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి సహకరించాలని వినతి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న జెడ్పీటీసీ గజ్జెల శృతి

కేవీపల్లె : కేవీపల్లె మండలంలో గ్రామీణ రోడ్ల అభివృద్ధి సహకారం అందించాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జెడ్పీటీసీ గజ్జెల శృతి విన్నవించారు. ఆదివారం సదుంలో మంత్రిని కలసి వినతిపత్రం అందజేశారు. మండలంలో వివిధ గ్రామాలకు ఉన్న పాత రోడ్లను అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే గర్నిమిట్ట పంచాయతీలో కొత్తగా మంజూరైన తారు రోడ్లు త్వరగా పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో పరిష్కరించాల్సిన సమస్యలు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీనారెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

పీలేరు : పట్టణంలోని స్థానిక పద్మావతి నగర్, ఎస్ కేడీ నగర్, ఆర్టీసీ నల్లగుట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. ప్రజల ఫిర్యాదుల మేరకు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా ట్రాన్స్‌కో అధికారులతో సంప్రదించి అక్కడున్న 50 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఏతం పురుషోత్తం, ఈవో ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ రవిశంకర్‌రెడ్డి, నాయకులు శ్రీరామ్‌సుధాకర్, బారేషా, సచిన్, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతులకు పశుబీమా వరం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పశు బీమా పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: వైఎస్సార్ పశుబీమా పథకం పాడి రైతులకు వరం లాంటిదని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బూడిదవేడు గ్రామంలో పశుబీమా పథకాన్ని ప్రారంభించారు. పాడి రైతుల శ్రేయస్సు కోసం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని వలన రైతులకు ఎంతో ఉపయోగం కలుగుతుందన్నారు. అనారోగ్యం రీత్యాగానీ, ప్రమాదవశాత్తు పశువులు మరణిస్తే ప్రీమియం మేరకు రూ.30వేలకు పైగా బీమా సాయం పొందవచ్చునన్నారు. ఇప్పటికే గ్రామాల్లోని పలువురు రైతులు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారని, ఇంకా బీమా చేసుకోని రైతులు ఈ నెలాఖరులోపు చేసుకోవాలని ఆయన సూచించారు. రైతుల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆశయమన్నారు. రైతులు బాగుంటే సమాజం ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, పశువైద్యాధికారిణి చరిత, ఏవో హేమలత, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం

వాల్మీకిపురం: సమాజంలోని నిరుపేద ప్రజలను ఆదుకునేందుకే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేద్దామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక భగవాన్ సత్యసాయి మందిరంలో మానవతా సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మానవుడిగా మన జీవితానికి పరిపూర్ణత చేకూరాలంటే కుటుంబం, స్వార్థం కాకుండా సమాజం కోసం సేవ చేయాల్సిన ధర్మ ఉందన్నారు. ఇప్పటికే ఫ్రీజర్ బాక్సులు, వైకుంఠ రథం, రోడ్డు పక్కన బల్లలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పచ్చదనం కార్యక్రమం కింద మొక్కలను నాటే కార్యక్రమాలను చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మానవతా సంస్థ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రామక్రిష్టారెడ్డి, కేశవ రెడ్డి, శంకర, ఓరుగంటి రమేష్, చంద్రమౌళి, లక్ష్మీనారాయణ, లక్ష్మన్న, శివారెడ్డి, రమణమూర్తి, సివి రమణ, ఆనంద శెట్టి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ములకలచెరువు: స్థానిక మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కవిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీ సీట్ల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 30వ తేదీ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు.

పెరిగిన టమాటల ధర

ములకలచెరువు: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆదివారం వచ్చిన టమాటలు అధిక ధర పలికాయి. 30 కేజీల నాణ్యమైన టమాట బాక్సు రూ.1600 నుంచి రూ.1800 వరకు పలికాయి. ఈ ఏడాదిలో అధిక ధరలు పలకడం ఇదే మొదటిసారి. ఇదిలా ఉండగా మార్కెట్‌కు టమాట కాయలు తక్కువగా వస్తున్నాయి. వ్యాపారులు పోటీపడి కాయలు కొనుగోలు చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ బదిలీ

కలికిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ డాక్టర్ పుష్పకుమారిని చిత్తూరు జిల్లా సదుం సీహెచ్‌సీకి బదిలీ చేస్తూ వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో రాజంపేట నుంచి డాక్టర్ అనీల్ కుమార్‌ను కలికిరి సీహెచ్‌సీకి బదిలీ చేశారు. అలాగే కలికిరిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులు అనిత మదనపల్లి ఏరియా ఆసుపత్రికి, సరస్వతి వాల్మీకిపురం సీహెచ్‌సీకి, రూపవతి నగిరికి, విద్య సదుం సీహెచ్‌సీకి, క్రిష్ణవేణి రాయచోటి ప్రభుత్వాసుపత్రికి బదిలీ అయ్యారు.

పాముకాటుకు సురక్షిత చికిత్స

పీలేరు : పాముకాటుకు ప్రభుత్వాస్పత్రుల్లో సురక్షిత చికిత్స అందుబాటులో ఉన్నట్లు తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం తలపుల పీహెచ్‌సీలో పాముకాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా పాము కాటుకు గురైతే శరీర భాగానికి 5 సెంటీమీటర్ల పైన తాడు సాయంతో కొద్దిగా బిగుసుగా కట్టాలని సూచించారు. బాధితుడ్ని కదపకుండా ధైర్యం చెబుతూ సమీప ప్రభుత్వాస్పత్రికి తరలించాలన్నారు. విషం విరుగుడికి యాంటీ స్నేక్ సీరమ్ ఇంజక్షన్ ప్రభుత్వాస్పత్రిలో లభిస్తుందని తెలిపారు

విరబూసిన బ్రహ్మకమలాలు



గుంతయంబాడిలో బ్రహ్మకమలం పుష్పాలను చూపుతున్న కె.శారదమ్మ

రామసముద్రం: మండలంలోని కుదురుచీమనపల్లె పంచాయతీ, గుంతయంబాడి గ్రామంలో నివాసం ఉన్న కృష్ణయ్యగారి శారదమ్మ, రామారావు ఇంటి ఆవరణంలో శనివారం రాత్రి బ్రహ్మ కమలం పుష్పాలు విరబూశాయి. సుమారు 12 పుష్పాల వరకు బ్రహ్మ కమలం విరబూయడంతో సంరక్షకురాలు శారదమ్మ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి తన ఇంటి ఆవరణంలో ఉన్న బ్రహ్మ కమలం చెట్టు పుష్పాలు విరబూస్తుందని తెలిపారు. ఈ పుష్పాలను చూసిన గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం







తంబళ్లపల్లె: నాటి గురువులతో పూర్వ విద్యార్థులు, మదనపలె సిటీ: హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో, పీలేరు: గురువులతో పూర్వ విద్యార్థులు

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె ఉన్నత పాఠశాలలో 1990-91లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో అపూర్వ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటి గురువులు హెచ్‌ఎం సిద్దారెడ్డి, ఉపాధ్యాయులు సిరోజీరావు, వెంకటరమణ, నారాయణలను ఆహ్వానించి సన్మానించారు.

మదనపల్లె సిటీ: హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 30 ఏళ్ల క్రితం చదువుకున్నవారు ఆదివారం పూర్వపు విద్యార్థుల సమావేశం నిర్వహించారు. స్థానిక కోటవీధిలోని హోప్ మున్సిపల్ పాఠశాలలో 1993-94 పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు కంభగిరిరాజు, శ్రీనివాసులు, శాంతకుమారి, శారదమ్మ, రాజమ్మ, రఘు తదితరులను సన్మానించారు.

పీలేరు రూరల్ : ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా సేవాభావం అలవర్చుకోవాలని తిరుపతి డీవైఈఓ ఆనందరెడ్డి అన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002-2003 పదవ తరగతికి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు.

రోగులకు అన్నదానం

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం శంకర్ నేత్రాలయ నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంకు వచ్చిన రోగులకు పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఆహార పొట్లాలను అందజేశారు. వివిధ ప్రాంతాలకు వచ్చిన రోగులకు క్యాంపులో అందించారు. ప్రతి నెలా జరిగే కార్యక్రమంలో రోగులకు అందజేస్తున్నట్లు తెలిపారు. నిర్వహకులు చిన్నా, ఉపాధ్యాయులు మహమ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

మదనపల్లె సిటీ: మదనపల్లెకు చెందిన పీవీ ప్రసాద్, విజయకుమారి దంపతులు ఆదివారం విలువైన పుస్తకాలు గ్రంథాలయానికి ఉచితంగా అందజేశారు. చందమామ సీరియళ్లు, ఇతర వార పత్రికల సీరియళ్లు సేకరించారు. అన్నింటినీ బైడింగ్ చేశారు. దీంతో పాటు పలు పుస్తకాలు గ్రంథాలయాధికారి వసంతకుమారికి అందించారు. కార్యక్రమంలో రచయిత టీఎస్‌ఏ కృష్ణమూర్తి, తిరుపతిరావు,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.